సాక్షి జగిత్యాల

గురువారం । 21 । మార్చి । 2024



మధ్యాహ్నం బడి కష్టాలు

విద్యార్థులకు మధ్యాహ్నం బడి కష్టాలు ఎదురవుతున్నాయి. 'పది' పరీక్షల నేపథ్యంలో కొన్ని పాఠశాలలు మధ్యాహ్నం నిర్వహిస్తున్న క్రమంలో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. 8లో ▸

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (సా॥)	సహర్ (ఉ॥)
కరీంనగర్	6.25	4.50
పెద్దపల్లి	6.33	4.57
రాజన్న సిరిసిల్ల	6.33	4.58
జగిత్యాల	6.33	4.57

వాతావరణం

గరిష్టం/కనిష్టం 31.0/22.0

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. వర్షం కురిసే అవకాశం లేదు. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పోలీసు కుటుంబాలకు అండగా ఉంటాం



హబీబ్ కుటుంబానికి చెక్కు అందిస్తున్న ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్

జగిత్యాలక్రైం: పోలీసు కుటుంబాలకు అండగా ఉంటామని ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ అన్నారు. కథలాపూర్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తూ అనారోగ్యంతో మృతిచెందిన హెడ్‌కానిస్టేబుల్ షేక్ హబీబ్ కుటుంబానికి పోలీసు భద్రత కింద రూ.8 లక్షలు మంజూరయ్యాయి. సంబంధిత చెక్కును ఆయన బుధవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో బాధిత కుటుంబసభ్యులకు అందజేశారు. హబీబ్ కుటుంబానికి పోలీసు శాఖ తరఫున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, బీ సెక్షన్ సూపరింటెండెంట్ నయీం పాల్గొన్నారు.

'కాంగ్రెస్‌వి మోసపూరిత హామీలు'



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

మల్లాపూర్(కోరుట్ల): రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటాలని జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. బుధవారం మల్లాపూర్ మండలంలోని రాఘవపేటలో బీఆర్‌ఎస్ మండల ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. మూడు నెలల్లోనే వాటిని అమలు చేయలేక, పాలన చేతకాక గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై ఇష్టారీతిన ఆరోపణలు చేస్తోందని మండిపడ్డారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజాక్షేత్రంలోనే ఎండగడదామన్నారు. కేంద్రంలోని బీజేపీ తెలంగాణ అభివృద్ధికి చేసిందేమీ లేదని విమర్శించారు. ప్రాజెక్టులకు జాతీయ హోదా ఇవ్వడం లేదని, మెడికల్ కాలేజీ, ఐటీఐఆర్, నవోదయ, ట్రిపుల్ ఐటీ మంజూరు చేయలేదని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి, ఆర్టీసీ మాజీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్దన్ రెడ్డిని గెలుపించుకుందామని పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, జెడ్పీటీసీ సభ్యుడు సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ కాటిపెల్లి సరోజన, వైస్‌ఎంపీపీ గౌరు నాగేశ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తోట శ్రీనివాస్, నాయకులు కాటిపెల్లి ఆదిరెడ్డి, దేవ మల్లయ్య, బద్దం నర్సారెడ్డి, ఏనుగు రాంరెడ్డి, క్యాతం జీవన్‌రెడ్డి, ముద్దం శరత్‌గౌడ్ తదితరులున్నారు.

'గృహజ్యోతి' అర్హులందరికీ వర్తించేలా చూడాలి

జగిత్యాల: గృహజ్యోతి పథకం అర్హులందరికీ వర్తించేలా చూడాలని 35వ వార్డు కౌన్సిలర్ జయశ్రీ కోరారు. ఈ మేరకు బుధవారం కలెక్టర్ యాస్మిన్ బాషాకు వినతిపత్రం అందజేశారు. కొందరు అధికారుల నిర్లక్ష్యం వల్ల డాటా ఎంట్రీ చేయకపోవడంతో అనేక మందికి గృహజ్యోతి పథకం రావడం లేదన్నారు. మున్సిపల్ అధికారుల వద్దకు వెళ్తే ఎడిట్ ఆప్షన్ లేదని సమాధానం ఇస్తున్నారని పేర్కొన్నారు. బాధితులు ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నారని తెలిపారు. ఈ విషయమై కమిషనర్ ద్వారా ఒక ప్రకటన చేయించాలని విన్నవించారు.

'కొండగట్టు'లో అవకతవకలపై ఫిర్యాదులు చేశా



మాట్లాడుతున్న ఈవో వెంకటేశ్

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయంలో అధికారులు, సిబ్బంది అవకతవకలపై దేవాదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్‌కు ఫిర్యాదులు చేశానని ఈవో వెంకటేశ్ తెలిపారు. కొండపై ఉన్న దేవస్థానం ఆఫీస్‌లో బుధవారం ఆయన మాట్లాడారు. ఈవోగా తాను విధుల్లో చేరాక అన్ని సెక్షన్ల అధికారులు దేవాదాయ శాఖ నిబంధనలు పాటించాలని ఉత్తర్వులు జారీ చేశానన్నారు. ముఖ్యంగా వేలంలో ఇటీవల రూ.52 లక్షలు ఆలయ ఖాతాకు జమ కాలేదని ఆడిట్‌లో తేలిందని పేర్కొన్నారు. టెండర్ల ఇన్‌చార్జి, అకౌంటెంట్, సూపరింటెండెంట్, ఏఈవోలు బాధ్యత తీసుకొని, డబ్బులు జమ చేయాలని చెప్పానన్నాను. సస్పెండ్ అయిన అధికారి సైతం కుటుంబసభ్యుల ఆరోగ్యం బాగా లేకపోవడంతో డబ్బు వాడుకున్నానని, సమయం ఇస్తే చెల్లిస్తాననంటూ లెటర్ ఇచ్చారని తెలిపారు. ఆలయంలో ఏం జరిగినా కమిషనర్‌కు ఫిర్యాదులు చేశానని అన్నారు. తన ఆదేశాలు పాటించి ఉంటే లోటుపాట్లు జరిగేవి కావన్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని దేవాదాయ కార్యాలయంలో ఫైళ్లపై విచారణ జరుగుతోందని పేర్కొన్నారు.

కలుషిత నీరే దిక్కు!



- ఇది జగిత్యాల విద్యానగర్‌లోని వాటర్ ట్యాంక్. చాలా ఏళ్ల క్రితం నిర్మించారు. నిబంధనల ప్రకారం దీన్ని 15 రోజులకోసారి శుభ్రం చేయాలి. కానీ, అధికారులు విస్మరిస్తున్నారు. దీంతో కలుషిత నీరే ప్రజలకు దిక్కవుతోంది. ఈ ట్యాంక్ వద్ద ఎలాంటి సూచిక బోర్డులు, శుభ్రం చేసిన తేదీలు కనిపించవు.



- ఇది జగిత్యాల కొత్త బస్టాండ్‌లోని వాటర్ ట్యాంక్. దీని పైపులన్నీ పాకురు పట్టాయి. శుభ్రం చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో ప్రజలకు కలుషిత నీరే సరఫరా అవుతోంది. ఇది ఈ రెండింటిదే కాదు జిల్లాలోని ప్రతీ ట్యాంక్ పరిస్థితి.



కొత్త బస్టాండ్ ట్యాంక్ వద్ద లీకవుతున్న తాగునీరు

- వాటర్ ట్యాంక్‌లను శుభ్రం చేయట్లే
- పాకురు పడుతున్న పైపులు
- అనేకచోట్ల పైప్‌లైన్ లీకేజీలు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు
- జిల్లాలోని 5 మున్సిపాలిటీల్లో పరిస్థితి

జగిత్యాల: వేసవి కాలం ప్రారంభమైంది. ప్రతి ఒక్కరికీ మంచినీరు ఎంతో అవసరం. అయితే, పట్టణ ప్రజలకు తాగునీరందించే ట్యాంకులను మున్సిపల్ అధికారులు శుభ్రం చేయించడం లేదన్న ఆరోపణలున్నాయి. కొన్ని ట్యాంకులైతే చెట్ల పొదల మధ్యలో ఉన్నాయి. 15 రోజులకోసారి శుభ్రం చేయాల్సి ఉండగా నెలలు గడుస్తున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు అంటున్నారు. ప్రతీ మున్సిపాలిటీలో ఫిల్టర్‌బెడ్ నుంచి ప్రధానంగా పట్టణాల్లో కొన్ని ఏరియాలకు ఒక ట్యాంక్ చొప్పున నిర్మిస్తారు. అక్కడినుంచి వివిధ కాలనీలకు మంచినీటి సరఫరా జరుగుతుంది. కానీ, ఫిల్టర్‌బెడ్ వద్ద హాలం వేయకుండానే నీరందిస్తున్నారు. జలా శయం వద్ద శుభ్రం చేసే పరికరాలు శిథిలావస్థకు చేరుతున్నాయి.

బోర్డులు ఏర్పాటు చేయాలి..

వాటర్ ట్యాంక్‌ను ఏరోజు శుభ్రం చేశారు? మళ్లీ ఏ రోజు చేయాలి? అనే అంశాలపై ఆయా ట్యాంకుల వద్ద తప్పకుండా బోర్డులు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. కానీ, కొన్నిచోట్ల నెల రోజుల క్రితం కడిగిన తేదీలే ఉన్నాయి. జగిత్యాల జిల్లాలో జగిత్యాల, మెట్‌పల్లి, కోరుట్ల, ధర్మపురి, రాయికల్ మున్సిపాలిటీలు ఉండగా, ఎక్కడా నిబంధనలు పాటించడం లేదు. మరోవైపు ఇటీవల మిషన్ భగీరథ పైప్‌లైన్‌లో భాగంగా అనేకచోట్ల మంచినీటి పైప్‌లైన్ పగిలిపోవడంతో నీరు కలుషితమవుతోంది. పైప్‌లైన్ లీకేజీలను అరికట్టకపోవడంతో ప్రజలకు అపరిశుభ్రమైన నీరే సరఫరా అవుతోంది.

రోగాలబారిన అనేక మంది..

అన్ని మున్సిపాలిటీల్లో 90 శాతం మంది మున్సిపల్ నీటినే వినియోగించుకుంటారు. కొందరు మాత్రమే మంచినీరు కొనుగోలు చేస్తుంటారు. ప్రతినెలా నల్లా బిల్లు ముక్కుపిండి వసూలు చేస్తున్న అధికారులు నీటి సరఫరాలో మాత్రం నిబంధనలు పాటించడం లేదని ప్రజలు అంటున్నారు. ఫలితంగా అనేక మంది రోగాలబారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి, 15 రోజులకోసారి వాటర్ ట్యాంక్‌లను శుభ్రం చేయడంతోపాటు లీకేజీలను అరికట్టాలని కోరుతున్నారు.

శుభ్రం చేసి, తేదీలు వేయలేదట..

వాటర్ ట్యాంక్‌లను ఎందుకు శుభ్రం చేయడం లేదని అధికారులను అడిగితే ఇటీవలే చేశామని, తేదీలు వేయడం మరిచిపోయామని చెప్పడం కొసమెరుపు. కొత్త బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన బోర్డులో లోలెవల్, హైలెవల్ కడిగిన తేదీ 15.07.2023 ఉండగా, మళ్లీ కడగాల్సిన తేదీ 15.08.2023 అని ఉంది. దీన్ని శుభ్రం చేసి, రెండు నెలలు గడుస్తోంది. ఇది అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది.

> **అధికారులను ఆదేశించాం**
>
> 
>
> 15 రోజులకోసారి కచ్చితంగా వాటర్ ట్యాంక్‌లను శుభ్రం చేయాలని, పైప్‌లైన్ లీకేజీలను అరికట్టాలని అధికారులను ఆదేశించాం. ప్రతీ ట్యాంక్ వద్ద బోర్డు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నాం.
>
> – అనిల్‌బాబు, మున్సిపల్ కమిషనర్, జగిత్యాల

ధర్మపురిలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం



స్వామివారి ఉత్సవమూర్తులను పుట్ట బంగారానికి తీసుకెళ్తున్న ప్రజాప్రతినిధులు

ధర్మపురి: స్థానిక శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు ఆలయ ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. శ్రీయోగానందా స్వామి ఆలయంలో పూజలు చేశారు. యజ్ఞాచార్యులు కందాళై పురుషోత్తమాచారి దంపతులను మేళతాళాలతో తీసుకువచ్చి, సన్మానించారు. సాయంత్రం చింతామణి చెరువు కట్ట వద్దకు వెళ్లి, పుట్ట బంగారం తీసుకువచ్చారు. ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ సత్తమ్మ, జెడ్పీటీసీ సభ్యురాలు అరుణ ఆలయ కమిటీ సభ్యులున్నారు.

నేడు స్వామివారి కల్యాణం

గురువారం స్వామివారి కల్యాణం జరిపించనున్నారు. ప్రభుత్వం తరఫున కలెక్టర్ పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించనున్నారు. 50 వేల మందికి పైగా భక్తులు తరలివస్తారని అంచనా వేస్తున్నారు. ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించనున్నారు. డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు.



పుట్టను తవ్వుతున్న విప్ లక్ష్మణ్‌కుమార్

రైతులు, యువతను మోసగించిన ప్రధాని

- నిజాం షుగర్ ఫ్యాక్టరీ తెరిపిస్తాం
- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

రాయికల్(జగిత్యాల): కేంద్ర ప్రభుత్వం రైతులు, నిరుద్యోగుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం రాయికల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రధాని మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులు, యువతను మోసం చేశారన్నారు. నిజామాబాద్ సభలో పసుపు బోర్డు ఏర్పాటు చేస్తామని ప్రకటించినప్పటికీ నోటిమాటకే పరిమితమైందని, అది ఎక్కడ ఏర్పాటు చేస్తారో, దానికి చైర్మన్ ఎవరో చెప్పలేదని విమర్శించారు. పెట్రోల్, డీజిల్ ధరలు ఆకాశాన్నంటాయని, ఎన్నికల నేపథ్యంలో లీటర్ పెట్రోల్, డీజిల్‌కు రూ.2 తగ్గించారని ఎద్దేవా చేశారు. రైతులకు రుణమాఫీ చేయకుండా అంబానీ, అదానీలకు ఇతర పారిశ్రామికవేత్తలకు సబ్సిడీ ఇచ్చారన్నారు. నిజాం షుగర్ ఫ్యాక్టరీని మూసివేసిన ఘనత బీజేపీకే దక్కిందని, సీఎం రేవంత్‌రెడ్డి చొరవతో ఆ ఫ్యాక్టరీని తెరిపించి, రైతులను ఆదుకుంటామని పేర్కొన్నారు. రాయికల్ పట్టణంలో ఫిల్టర్ బెడ్ పునరుద్ధరణకు రూ.4.90 కోట్లు, మూడు బొమ్మల నుంచి తుర్క కాశీనగర్ వరకు రూ.2.17 కోట్లు, ఇటిక్యాల కాలేజీ నుంచి ఒడ్డెరకాలనీ వరకు రోడ్డు నిర్మాణానికి రూ.1.60 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు.

అంజనిశ్రీకి కృత్రిమ కాలు ఏర్పాటు చేయిస్తాం

రాయికల్ మండలంలోని రామాజీపేటకు చెందిన కూచిపూడి కళాకారిణి దివ్యాంగురాలైన అంజనిశ్రీకి సీఎం రేవంత్‌రెడ్డి చొరవతో కృత్రిమ కాలు ఏర్పాటు చేయిస్తామని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి హామీ ఇచ్చారు. బుధవారం రాయికల్ పట్టణంలో ఆమెను సన్మానించారు. కార్యక్రమాల్లో పార్టీ పట్టణ అధ్యక్షుడు మ్యాకల రమేశ్, మండల అధ్యక్షుడు రవీందర్‌రావు, జిల్లా నాయకులు గోపి రాజారెడ్డి, మహిపాల్‌రెడ్డి, షాకీర్, సుధీర్‌రెడ్డి, నర్సయ్య పాల్గొన్నారు.



అంజనిశ్రీని సన్మానించిన ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

అన్నివర్గాల సంక్షేమమే లక్ష్యం..

జగిత్యాలటౌన్: అన్నివర్గాల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. తిప్పన్నపేట గంగపుత్ర మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు కొంద్ర శంకర్, సభ్యులు బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి జగిత్యాల ఇందిరాభవన్‌లో ఆయన కండువాలు కప్పి, ఆహ్వానించారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు కోసం కృషి చేయాలని కోరారు.

ఎస్సారెస్పీ అధికారుల తీరుపై ఆగ్రహం

సారంగాపూర్(జగిత్యాల): ఎస్సారెస్పీ నీటి విడుదల విషయంలో ఎస్సారెస్పీ అధికారుల తీరుపై ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి బుధవారం ఆగ్రహం వ్యక్తం చేశారు. సారంగాపూర్, దోనూర్ రైతులు సాగు నీరందడం లేదని ఫిర్యాదు చేయడంతో ఆయన నేరుగా సారంగాపూర్, రంగపేట శివారు ఎస్సారెస్పీ కాల్వలు, పొలాలను పరిశీలించారు. సీఈ సుధాకర్‌రెడ్డి, ఎస్‌ఈ అశోక్‌కుమార్, ఈఈ నారాయణరెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు. మీ మధ్య సమన్వయం లేకపోవడం వల్లే పంటలు ఎండిపోతున్నాయని అన్నారు. అధికారులు స్పందిస్తూ నీరందేలా చూస్తామని పేర్కొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక..

బీర్‌పూర్ మండలానికి చెందిన పలువురు బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరగా వారికి ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, కండువాలు కప్పారు. ఎంపీపీ మసర్తి రమేశ్ తదితరులున్నారు.

అడుగంటిన ఎస్సారెస్పీ

- 19 టీఎంసీలకు పడిపోయిన నీరు
- ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 90.30 టీఎంసీలు
- గతేడాది ఇదే రోజు 33.764 టీఎంసీలు
- ఈ నెల 25 వరకే చివరి నీటి తడి ఇస్తామన్న అధికారులు
- యాసంగి పంటలు పండేనా?
- ఆందోళనలో ఉమ్మడి జిల్లా రైతులు



ఎస్సారెస్పీలో తగ్గిన నీరు

జగిత్యాల అగ్రికల్చర్: ఉమ్మడి జిల్లాకు సాగు, తాగు నీరందించే శ్రీరాంసాగర్ ప్రాజెక్టు(ఎస్సారెస్పీ) అడుగంటింది. నీరు రోజురోజుకూ తగ్గుతూ బుధవారం నాటికి 19.316 టీఎంసీలకు పడిపోయింది. దీంతో ఆయకట్టు రైతుల్లో ఆందోళన నెలకొంది. ప్రాజెక్టు అధికారులు సైతం జోన్–1 ఆయకట్టు(డీ–5 నుంచి డీ–53)కు ఈ నెల 25 వరకు మాత్రమే చివరి సాగు నీటి తడి ఇస్తామని ప్రకటించారు. ఉష్ణోగ్రతలు గరిష్ట స్థాయికి చేరుతుండటంతో వేసవిలో సాగు చేసిన వరి పంట పండేనా అని అన్నదాతలు దిగులు చెందుతున్నారు.

ఇష్టారీతిన వినియోగంతోనే సమస్య

ఈ ఏడాది ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండినప్పటికీ ఓ ప్రణాళిక అంటూ లేకుండా నీటిని ఇష్టారీతిన వినియోగించడంతో సాగు నీటికి ఇబ్బందులు ఏర్పడే పరిస్థితి వచ్చింది. ప్రజాప్రతినిధులు చెప్పిందే వేదం, అవసరమున్నా, లేకున్నా, వానాకాలం, ఎండాకాలం తేడా లేకుండా ఎస్సారెస్పీ అధికారులు ఎప్పుడు పడితే అప్పుడు నీటిని విడుదల చేశారు. ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండినప్పుడు మాత్రమే వరద నీటిని గోదావరిలోకి విడుదల చేయాల్సి ఉండగా నిబంధనలకు తిలోదకాలిచ్చారు. వరద కాల్వకు సైతం కాకతీయ ప్రధాన కాల్వ మాదిరిగా నీటిని విడుదల చేస్తుండటం కాల్వ ఆయకట్టు రైతులకు సమస్యగా మారింది. ఎస్సారెస్పీ కాల్వలకు ఇష్టారీతిన తూములు ఏర్పాటు చేసి, సాగు నీటిని చెరువులకు మళ్లిస్తున్నారు. దీంతో, చివరి ఆయకట్టుకు నీటి విడుదల సరిగా జరగక ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఎక్కడో ఓచోట అన్నదాతలు రోడ్డెక్కుతూనే ఉన్నారు.

7 లక్షల ఎకరాల ఆయకట్టు..

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఎస్సారెస్పీ కింద 7 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంటే.. ఇందులో 3 లక్షల ఎకరాలు ఒక్క జగిత్యాల జిల్లాలోనే ఉంది. ఉమ్మడి జిల్లాలో ఈ యాసంగికి వరినే అత్యధిక విస్తీర్ణంలో(80 శాతం) సాగు చేశారు. ప్రస్తుతం అన్ని ప్రాంతాల్లో వరి పంట పొట్ట దశలో ఉంది. ప్రస్తుతం పంట పొట్ట దశలో ఉంది. ఇప్పుడు నీరందకపోతే చాలా కష్టం. ప్రాజెక్టు నుంచి మరో 9 టీఎంసీల నీరు మాత్రమే విడుదల చేసే అవకాశం ఉంది. తాగునీటి అవసరాల కోసం 10 టీఎంసీల నీటిని డెడ్ స్టోరేజీగా ప్రాజెక్టులోనే ఉంచుతారు. అయితే, రానున్న రోజుల్లో ఎస్సారెస్పీ నుంచి సాగు నీరందే పరిస్థితులు కనిపించడం లేదు. రైతులు వ్యవసాయ బావులపైనే ఆధారపడి, పంటలను కాపాడుకోవాల్సిన దుస్థితి ఎదురవనుంది.

ప్రాజెక్టులోకి 203.992 టీఎంసీలు

ఎస్సారెస్పీలోకి గత జూన్ 1 నుంచి ఇప్పటివరకు 203.992 టీఎంసీల నీరు చేరింది. అయితే, ప్రాజెక్టులో ఉన్న పాత నీటిని కలుపుకొని మొత్తం 205.658 టీఎంసీలను సాగు, తాగునీటి అవసరాలకు విడుదల చేశారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 1,091.00 అడుగులు కాగా, ప్రస్తుతం 1,064.40 అడుగులు ఉంది. నీటి నిల్వ సామర్థ్యం 90.30 టీఎంసీలకు ప్రస్తుతం 19.316 టీఎంసీలకు పడిపోయింది. గతేడాది ఇదే రోజున 33.764 టీఎంసీలు ఉండటం గమనార్హం. ప్రస్తుతం ప్రాజెక్టు నుంచి కాకతీయ కాల్వకు 3,500 క్యూసెక్కులు, లక్ష్మీ కెనాల్‌కు 250, అలీసాగర్ ఎత్తిపోతల పథకానికి 347, గుత్పా ఎత్తిపోతల పథకానికి 270, నిజామాబాద్, నిర్మల్ జిల్లాల్లో చెరువులకు 312, సరస్వతి కెనాల్‌కు 400, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

చివరి ఆయకట్టుకు నీరందించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల: చివరి ఆయకట్టుకు నీరందించాలని, రైతుబంధు విడుదల చేయాలని, వరి, మొక్కజొన్న పంటలకు మద్దతు ధర ఇవ్వడంతోపాటు మామిడి రైతులకు ఎకరాకు రూ.25 వేల పరిహారం చెల్లించాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ కోరారు. జగిత్యాలలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 100 రోజులైనా రైతులకు రైతుబంధు ఇవ్వలేదన్నారు. జగిత్యాల నియోజకవర్గంలో 35 వేల ఎకరాల్లో మామిడి తోటలకు నష్టం వాటిల్లిందని తెలిపారు. ఎస్సారెస్పీలో ఉన్న 19 టీఎంసీల నీటితో జగిత్యాలలో ఒక్క ఎకరం ఎండకుండా చూడాలన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు మహేశ్, నాయకులు రాజేంద్రప్రసాద్, శంకర్ తదితరులున్నారు.

పూట గడిచేదెట్లా?

- కరీంనగర్‌కు చెందిన రమేశ్ తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్‌లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి. మంగళవారం నుంచి అతని సేవలు తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో డెలివరీబాయ్‌గా పనిచేసుకునేందుకు సిద్ధమయ్యాడు.

- సర్వశిక్ష అభియాన్‌లో పీడీగా పనిచేసే సిబ్బంది తమకు వచ్చే నెలలో 'నోవర్క్ నో పే' వస్తుందని గ్రహించి, ముందుగానే మరో చోట ట్యూషన్లు చెప్పుకోవడం లేదంటే.. రాపిడో, ఉబర్ వంటి సంస్థల్లో రైడర్‌గా చేరాలని నిర్ణయించుకున్నారు.

- ఉమ్మడి జిల్లాలో ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి ఉద్వాసన
- మూడు రోజుల నుంచి రెండు నెలలపాటు 'నో వర్క్ నో పే'
- సీఎం రేవంత్ రెడ్డి మాట నిలబెట్టుకోవాలని వేడుకోలు
- పిల్లల పోషణకు దినసరి కూలీలు అవుతామని ఆవేదన
- వివిధ విభాగాల్లో 11వేల మందికిపైగా బాధితులు



కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట కాంట్రాక్టు ఉద్యోగుల దీక్ష (ఫైల్). ఇన్‌సెట్లో వరంగల్ దీక్షలో మాట్లాడుతున్న ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి (ఫైల్)

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ఔట్‌సోర్సింగ్ విధానంలో వివిధ ప్రభుత్వ విభాగాల్లో పనిచేస్తున్న సిబ్బందికి మార్చి వచ్చిందంటే గుండెదడే. ఎప్పటిలాగే మీ సేవలను తాత్కాలికంగా పక్కన పెడుతున్నామంటూ ప్రభుత్వం నుంచి ఈ ఏడాది కూడా ఆదేశాలు వచ్చాయి. ఉమ్మడిజిల్లా వ్యాప్తంగా ఈ తాత్కాలిక ఉద్వాసన వల్ల వేసవిలో మూడురోజుల నుంచి రెండు మాసాలపాటు ఉపాధి కోల్పోయే వారు దాదాపు 11,000మంది. ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న వేళ ఎప్పటిలాగే ఈ ఏడాది కూడా ప్రభుత్వం నుంచి వివిధ విభాగాల్లో కొనసాగుతున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి టెర్మినేషన్ ఆదేశాలు అందుతున్నాయి. దీంతో ఏదోఒక పనిచేసి కుటుంబాన్ని పోషించుకునేందుకు సిద్ధమవుతున్నారు. వీరిలో చాలామంది పదో తరగతి నుంచి పీజీలు, పీహెచ్‌డీలు చేసిన వా రు ఉన్నారు. అంతా ఆయా విభాగాల్లో ఏళ్లుగా కొనసాగుతున్న వారే. అయితే, వీరెవరూ ఏ కార్యాలయంలోనూ 365 రోజులు పనిచేసిన దాఖలాలు లేవు.

కారణం ఏమిటి?

చాలా ప్రభుత్వ విభాగాల్లో సిబ్బంది కొరత ఉంది. ముఖ్యంగా విద్య, వైద్యారోగ్యశాఖల్లో ఈ కొరత అధికం. మిగిలిన అన్ని విభాగాల్లోనూ ఆఫీసు, ఫీల్డ్ లెవల్‌లో పనిచేసేందుకు సిబ్బందిని ఔట్‌సోర్సింగ్ పద్ధతిన నియమించుకుంటున్నాయి. వీరికి ఈఎస్‌ఐ, పీఎఫ్ వంటి సదుపాయాలు ఉంటాయి. కానీ, వీరిని ఏడాదిపాటు ఎట్టిపరిస్థితుల్లో కొనసాగనివ్వరు. కనిష్టంగా మూడు రోజుల నుంచి గరిష్టంగా రెండు నెలలపాటు వీరికి తాత్కాలికంగా ఉద్వాసన పలుకుతారు. కొత్త ఆర్థిక సంవత్సరంలో వీరిని తిరిగి తీసుకుంటారు. అప్పటి వరకూ 'నో వర్క్... నో పే' విధానం అమలు చేస్తారన్న మాట. ఈ కాలంలో ఎలాంటి వేతనం రాదు కాబట్టి ఈ ఉద్యోగులంతా కూలీనాలీ చేసుకుని జీవించాల్సిందే. 365 రోజులపాటు వీరు ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగులుగా పనిచేస్తే.. కొన్నేళ్ల తరువాత తమను రెగ్యులరైజ్ చేయాలంటూ న్యాయస్థానాల్లో కేసులు వేస్తారన్న అభద్రతాభావంతో ప్రభుత్వమే వారిని ఏటా కొంతకాలం పాటు తొలగించి, తిరిగి కొత్త నియామకం కింద చూపిస్తుంది.

ఉమ్మడి జిల్లాలో 11 వేల మంది

ఔట్‌సోర్సింగ్ విధానంలో కరీంనగర్, పెద్దపల్లి, సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల్లో మొత్తం దాదాపు పదకొండు వేలమందికిపైగా సిబ్బంది పనిచేస్తున్నారు. వీరందరినీ ఇప్పుడు విభాగాల వారీగా వారి అవసరాన్ని బట్టి తొలగించి, కొన్ని రోజులు లేదా వారాల తరువాత తిరిగి నియమించుకుంటారు. ఈ విధానం రద్దు చేయాలంటూ సర్వశిక్షా అభియాన్ సిబ్బంది గతేడాది దాదాపు 25 రోజులపాటు సమ్మె చేశారు. గత ప్రభుత్వంలో ఎలాగూ తమకు ఇబ్బందులు తప్పలేదని, కనీసం తాజాగా ప్రభుత్వంలోనైనా తమకు న్యాయం చేయాలని సిబ్బంది విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ విషయంలో బయటికి వచ్చి గోడు వెళ్లబోసుకుందామని అనుకున్నా.. ఎక్కడ తిరిగి విధుల్లోకి చేర్చుకోరో అన్న భయంతో వెనకడుగు వేస్తున్నారు.

> **సీఎం మాట నిలబెట్టుకోవాలి**
>
> 
>
> ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి 2023 సెప్టెంబరు 13న ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలోనే వరంగల్‌లోని మా దీక్షా శిబిరాన్ని సందర్శించారు. తాము అధికారంలోకి రాగానే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను అన్నిరకాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం ఎలాగూ మమ్మల్ని పట్టించుకోలేదు. కనీసం ఈ సీఎం అయినా మా సమస్యలు పరిష్కరించాలి. మాకు ఉద్యోగ భద్రత కల్పించి, క్రమబద్ధీకరించాలి.
>
> – బెజ్జంకి ఆంజనేయులు, ఎస్‌ఎస్‌ఏ జేఏసీ కరీంనగర్ అధ్యక్షుడు

> **రెగ్యులరైజ్ చేయాలి**
>
> 
>
> శాశ్వత ప్రాతిపదికన పనిచేసే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయాలి. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అందజేయాలి. కాంట్రాక్టు ఉద్యోగులకు కనీస వేతనాలు ఇవ్వకుండా శ్రమదోపిడీ చేస్తున్న తీరును ప్రభుత్వానికి ఎన్నోసార్లు విన్నవించాం. అయినా ఫలితం లేదు. ప్రభుత్వం వెంటనే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల విషయంలో సానుకూల నిర్ణయం తీసుకోవాలి.
>
> – ఎర్ల రమేశ్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు

> **12 నెలల వేతనం ఇప్పించాలి**
>
> 
>
> విద్యాశాఖలో ఔట్‌సోర్సింగ్ కింద పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బందికి రెండు నెలలపాటు వేతనాలు చెల్లించాలి. సీఎం రేవంత్ గత ఎన్నికల ముందు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను అన్ని రకాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. వెంటనే అమలు చేయాలి. ఈ రెండు నెలలు ఆ సిబ్బంది కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా ఆదుకోవాలి.
>
> – డాక్టర్ బీఎస్ రావు, బీఆర్‌ఎస్ నాయకుడు

క్లుప్తంగా

బైక్ అదుపుతప్పి యువకుని మృతి


రాకేశ్ మృతదేహం

రామడుగు: మండలంలోని వెంకట్రావుపల్లి గ్రామశివారులో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రాజన్నసిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం అనంతపల్లి గ్రామానికి చెందిన అలువాల రాకేశ్(21) అనే యువకుడు మృతి చెందినట్లు ఎస్సై సురేందర్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నవి. గోపాల్‌రావుపేటకు చెందిన స్నేహితుడు రాగుల అరవింద్‌తో కలిసి రాకేశ్ గ్రామంలో జన్మదిన వేడుకల్లో పాల్గొన్నాడు. చొప్పదండి మండల కేంద్రంలోని దాబాలో డిన్నర్ చేయడానికి ఇద్దరూ బైక్‌పై వెళ్లారు. వెంకట్రావుపల్లి శివారులో మూలమలుపు వద్ద బైక్ అదుపు తప్పి చెట్టుకు ఢీకొంది. ప్రమాదంలో రాకేశ్‌తో పాటు అరవింద్‌కు తీవ్రగాయాలయ్యాయి. వెనకలా వస్తున్న బంధువులు క్షతగాత్రులను కరీంనగర్ ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా రాకేశ్ మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి తల్లి అల్వాల రాజేశ్వరి ఫిర్యాదుతో నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

శునకానికి పూజలు


శునకానికి పూజలు చేస్తున్న అనంతలక్ష్మి

జగిత్యాలటౌన్: కాలభైరవుడిగా ప్రతి రూపంగా భావించి శునకానికి ప్రత్యేక పూజలు చేశారు జిల్లా కేంద్రానికి చెందిన అనంతలక్ష్మి దంపతులు. తులసీనగర్‌కు చెందిన ఆకుల నాగరాజు ఇంట్లో శునకానికి జగిత్యాల పట్టణానికి చెందిన నాగమల్ల రాజేశం అనంతలక్ష్మి దంపతులు పత్యేక పూజలు చేశారు. కాశీ యాత్ర అనంతరం కాలభైరవుడి రూపంలోని శునకానికి పూజలు చేసినట్లు అనంతలక్ష్మి దంపతులు తెలిపారు. శుద్ధ జలంతో శునకానికి స్నానం చేయించి, కుంకుమ బొట్టు పెట్టి పూలమాలలు వేసి పిండి పధార్థాలను నైవేద్యంగా సమర్పించారు. ఈ సందర్భంగా అనంతలక్ష్మి దంపతులు మాట్లాడుతూ కాశీకి వెళ్లిన భక్తులు కాశీవిశ్వనాథుడి కంటే ముందుగా కాలభైరవుడిని దర్శనం చేసుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. అలాగే కాశీయాత్ర ముగించుకుని వచ్చిన తర్వాత శునకానికి పూజలు చేయడం సాంప్రదాయమని తెలిపారు.

మధ్యాహ్నం బడి కష్టాలు!

- పదో తరగతి సెంటర్ ఉన్న చోట పనివేళల మార్పు
- మధ్యాహ్నం 3గంటల తరువాత అందుతున్న మధ్యాహ్న భోజనం
- జగిత్యాలలో పరీక్ష ఉన్నా లేకున్నా.. మధ్యాహ్నమే పనివేళలు
- అయిష్టంగానే హాజరవుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



జిల్లా	పరీక్ష కేంద్రాలు	పది విద్యార్థులు	1–9 విద్యార్థులు
కరీంనగర్	75	12,458	38,877
సిరిసిల్ల	45	7,725	68,775
జగిత్యాల	35	6,475	25,535
పెద్దపల్లి	64	11,394	47,433

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: వేసవి మొదలైంది. ప్రభుత్వ పాఠశాలల పిల్లల్ని ఎండల బారి నుంచి కాపాడేందుకు ప్రభుత్వం ఒంటి పూట బడులను ప్రారంభించింది. సాధారణంగా ఒంటి పూటబడి అంటే ఉదయం పూటే తరగతులు ముగించుకుని మధ్యాహ్నం ఎండ జోరు పెరిగేలోగా విద్యార్థులు ఇళ్లు చేరుకోవాలి. అయితే, ఇక్కడే ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వందలాదిమంది పిల్లలకు చిక్కులు ఎదురవుతున్నాయి. ఆ వెంటనే పదో తరగతి పరీక్షలు మొదలయ్యాయి. ప్రతీ మండలంలోని రెండు లేదా మూడు ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి పరీక్ష కేంద్రాలు నడుస్తున్నాయి. దీంతో విధి లేక ఒంటి పూట బడికి మధ్యాహ్నం సమయంలో హాజరవాల్సి వస్తుంది. పరీక్ష ఉన్న రోజుల్లో ఎలాగోలా ఉపాధ్యాయులు, విద్యార్థులు సర్దుకుంటున్నారు. కానీ, ఒక్క జగిత్యాల జిల్లాలో పది పరీక్షలు ముగిసేదాకా మధ్యాహ్నం పనివేళలే కొనసాగుతాయని ఉన్నతాధికారులు చెప్పడంతో ఆ జిల్లా విద్యార్థులు కంగుతిన్నారు. చేసేది లేక ఎండలోనే పాఠాలకు హాజరవుతున్నారు.

ఏంటి సమస్య?

రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 15 నుంచి ఒంటి పూట బడులు మొదలయ్యాయి. మూడు రోజుల వ్యవధితో పదో తరగతి పరీక్షలు కూడా ప్రారంభమయ్యాయి. ఇందుకోసం ఉమ్మడి జిల్లాలోని కరీంనగర్, పెద్దపల్లి, సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల్లో పలు ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి పరీక్షా కేంద్రాలు కూడా మంజూరయ్యాయి. ఈ క్రమంలో ఒంటిపూట బడి అమలు చేసే విషయంలో వీరు పనివేళలను మార్చుకోవాల్సి వచ్చింది. సాధారణంగా ఉదయం 7.45 గంటలకు మొదలైన పాఠశాల పనివేళలు మధ్యాహ్నం 12.30 గంటల వరకు సాగాలి. అయితే, పరీక్షా కేంద్రాలు కేటాయించిన చోట విద్యార్థులు తమ ఒంటి పూట బడిని అనివార్యంగా మార్చుకోవాల్సి వచ్చింది. దీంతో 1వ తరగతి నుంచి 9వ తరగతి వరకు అన్ని జిల్లాల విద్యార్థులు మధ్యాహ్నం 1 గంటలకు పాఠశాల పనివేళలు మొదలై సాయంత్రం 5 గంటల వరకు సాగుతున్నాయి. ఈక్రమంలో పాఠశాలల్లో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఎండ, ఉక్కపోత వల్ల పాఠాలు సరిగా వినలేక పోతున్నారు. మరోవైపు మధ్యాహ్నం ఒంటిపూట పాఠశాల నడుస్తున్న క్రమంలో అందులో విద్యనభ్యసించే వారికి భోజనం పూర్తయి వడ్డించే సరికి మ.3గంటలు దాటుతోంది. అప్పటి వరకు ముఖ్యంగా హాస్టల్‌లో ఉండే పిల్లలు ఆకలితో ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిచోట్ల తరగతుల్లో ఫ్యాన్లు, తాగునీరు సదుపాయాలు పూర్తిస్థాయిలో లేవని ఉపాధ్యాయులు అంటున్నారు. ఈనెల 30వ వరకు పదో తరగతి పరీక్షలు నడుస్తాయి. రోజు విడిచి రోజు పరీక్షలు జరగనున్నాయి. సిరిసిల్ల, పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాల్లో పరీక్షలేని రోజుల్లో ఉదయం పూటే తరగతులు జరుగుతున్నాయి. కానీ, ఒక్క జగిత్యాల జిల్లాలో మాత్రం ఇందుకు విరుద్ధంగా ఉంది. కనీసం పది పరీక్షలు లేని రోజుల్లోనైనా తమకు ఉదయంపూట బడి నడిచేలా జిల్లా విద్యాధికారి (ఈడీవో) అయినా చొరవ తీసుకోవాలని ఉపాధ్యాయులు, విద్యార్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.

వన్యప్రాణుల వేట.. అతనికో ఆట

- మాంసంతో సన్నిహితులకు విందు
- కొంతకాలంగా ఏ–2 నిందితుడి ఇంట్లోనే ఉంటున్న సత్యనారాయణ


మృతిచెందిన నెమలి (ఫైల్)

మల్యాల(చొప్పదండి): వన్యప్రాణుల వేట.. అతనికో ఆటగా మారింది. మల్యాలలో మకాం వేసి, మూడేళ్లుగా కొడిమ్యాల, జగిత్యాల రేంజ్ పరిధిలోని అటవీ ప్రాంతాల్లో జంతువులను వేటాడుతూ, వాటి మాంసంతో సన్నిహితులకు విందు ఏర్పాటు చేస్తున్నాడని స్థానికులు చెబుతున్నారు. గంగాధర మండలంలోని లక్ష్మీదేవిపల్లికి చెందిన నలువాల సత్యనారాయణ పెగడపల్లి మండలంలోని దోమలకుంట సమీపంలో నెమలిని తుపాకీతో కాల్చి చంపి, కారులో తీసుకెళ్తూ పోలీసులకు పట్టుబడ్డాడు. అతను ఏ–2 నిందితుడు మల్యాల మండల కేంద్రానికి చెందిన జవ్వాజి రాజు ఇంట్లోనే ఉంటూ వన్యప్రాణుల వేట కొనసాగిస్తున్నట్లు సమాచారం. రాజుకు దూరపు బంధువుగా స్థానికులకు పరిచయమయ్యాడు. దసరా, సంక్రాంతి పండుగలకు అడవి పంది, దుప్పి వంటి జంతువులను వధించి, వాటి మాంసంతో స్థానికంగా కొంతమంది పెద్ద మనుషులకు సైతం విందు ఇచ్చినట్లు తెలిసింది. నెమలిని చంపిన కేసులో సత్యనారాయణ ఏ–1 నిందితుడిగా ఉండటంతో మల్యాలలో అతనితో కలిసి విందులో పాల్గొన్న స్థానికుల్లో గుబులు మొదలైంది. మల్యాల మండలంలోని ముత్యంపేట, ఓబులాపూర్, బల్వంతాపూర్, కొడిమ్యాల మండలంలోని సూరంపేట అటవీ ప్రాంతాల్లో వన్యప్రాణులను చంపి, తాను ఉండే ఇంట్లోనే మాంసాన్ని వేరుచేసి, సన్నిహితులకు చేరవేసేవాడని స్థానికులు అంటున్నారు.

గుండెపోటుతో ఏఎస్సై మృతి


కిషన్ (ఫైల్)

కరీంనగర్‌క్రైం: కరీంనగర్‌రూరల్ పోలీసుస్టేషన్‌లో ఏఎస్సైగా పని చేస్తున్న మార్కొండ కిషన్(59) బుధవారం గుండెపోటుతో మృతిచెందాడు. కరీంనగర్ జ్యోతినగర్‌లో ఉంటున్న కిషన్ తన ఇంట్లోనే గుండెలో నొప్పి రావడంతో చనిపోయాడు. జిల్లాలోని తిమ్మాపూర్ మండలం మన్నెంపల్లికి చెందిన కిషన్ 1984లో పోలీసుశాఖలో కానిస్టేబుల్‌గా చేరారు. 40ఏళ్లు కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో పని చేశారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన అతి ఉత్కృష్ట సేవ పతకం అందుకున్నారు. కిషన్‌కు భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అతని స్వగ్రామంలో అంత్యక్రియలు జరిగాయి.

రైతును కాటేసిన కరెంట్


రాజయ్య మృతదేహం

ఓదెల(పెద్దపల్లి): పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం కనగర్తి గ్రామంలో గుండారపు రాజయ్య(60) అనే రైతు విద్యుదాఘాతంతో మృతిచెందాడు. సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి, పొత్కపల్లి ఎస్సై అశోక్‌రెడ్డిల కథనం ప్రకారం.. కనగర్తి గ్రామానికి చెందిన ఆరెల్లి వీరయ్య– దీవెనమ్మకు చెందిన పొలాన్ని రాజయ్య కౌలుకు తీసుకున్నాడు. ఈ యాసంగిలో వరి పండిస్తున్నాడు. రోజూమాదిరిగానే బుధవారం ఉదయం పొలానికి నీళ్లు పెట్టేందుకు వెళ్లాడు. పొలంలో కిందపడి ఉన్న విద్యుత్ తీగను గమనించక దానిపై అడుగు వేశాడు. వెంటనే విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య ఎడ్లెమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

విద్యుత్ షాక్‌కు గురై కూలీ మృతి

పెద్దపల్లిరూరల్: పట్టణ శివారు రంగంపల్లిలో ఓ పాత ఇంటిని కూల్చే పనులు చేస్తున్న కూలీ ఒల్లెపు ఉపేందర్ (25) ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌కు గురై బుధవారం మరణించాడు. పట్టణంలోని శాంతినగర్ ప్రాంతంలో నివాసముంటున్న ఉపేందర్ పాత ఇంటిని కూల్చుతుండగా అందులో ఉన్న ఓ ఇనుపరాడ్ ఇంటికి సమీపంలో ఉన్న విద్యుత్ తీగలకు తగిలింది. దీంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్సైలు సుధాకర్‌రావు, మల్లేశ్ ఘటనాస్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో ఇంటర్ విద్యార్థిని దుర్మరణం


హన్సిక (ఫైల్)

సుల్తానాబాద్‌రూరల్: దుబ్బపల్లి గ్రామ సమీప రాజీవ్ రహదారిపై బుధవారం ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొన్న ప్రమాదంలో ఇంటర్ విద్యార్థి తెలికుంట హన్సిక(17) అక్కడికక్కడే మృతిచెందింది. ఆమె సోదరుడు భానుప్రకాశ్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఎస్సై శ్రావణ్ కుమార్ కథనం ప్రకారం.. సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి గ్రామానికి చెందిన తెలికుంట హన్సిక జూలపల్లి మండలం తెలుకుంటలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో ఇంటర్ చదువుతోంది. బుధవారం కరీంనగర్ విద్యానగర్‌లోని తన బాబాయి ఇంటికి పనిపై వెళ్లింది. బాబాయ్ కొడుకు భానుప్రకాశ్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై సుల్తానాబాద్‌కు బయలు దేరింది. ఈక్రమంలో దుబ్బపల్లి వద్ద లారీ వెనుక నుంచి వచ్చి వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో హన్సిక తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందింది. తీవ్రగాయాలైన భానుప్రకాశ్‌ను వెంటనే ఆస్పత్రికి తరలించారు. మృతురాలి తల్లి పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై వివరించారు. కాగా, కూలీ పనులు చేస్తూ తన ఇద్దరు కూతుళ్లను పెంచి పెద్దచేసిన పద్మ.. చేతికి అందివచ్చిన చిన్నకూతురు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందడంతో కన్నీటిపర్యంతమవుతోంది.

ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య

మల్యాల(చొప్పదండి): జీవితంపై విరక్తి చెంది యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మల్యాల మండలం నూకపల్లిలో బుధవారం చోటుచేసుకుంది. ఏఎస్సై కృష్ణకుమార్ కథనం ప్రకారం.. మండలంలోని నూకపల్లి గ్రామానికి చెందిన సైదులు వంశీ(23), ఒబులాపూర్ గ్రామానికి చెందిన యువతిని వివాహం చేసుకున్నాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో విడాకులు తీసుకున్నారు. ఈ క్రమంలో యువకుడు వంశీ జీవితంపై విరక్తి చెంది బుధవారం తెల్లవారుజామున తన ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

పోలీసుల అదుపులో యువకుడు

జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లా కేంద్రంలోని మహిళ వసతి గృహం వద్ద అనుమానస్పదంగా తిరుగుతున్న యువకుడిని సీసీఎస్ పోలీసులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. పట్టణంలోని మహిళా వసతి గృహం వద్ద గత కొద్దిరోజులుగా కొంతమంది యువకులు అనుమానాస్పదంగా తిరుగుతున్నారు. ఈ నేపథ్యంలో వసతి గృహ నిర్వాహకులు ఆ ప్రాంతంలో సీసీకెమెరాలను ఏర్పాటు చేశారు. బుధవారం సాయంత్రం అనుమానాస్పదంగా తిరుగుతున్న యువకున్ని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. దీంతో ఆ యువకున్ని పట్టణ పోలీసులు విచారిస్తున్నారు.

స్వగ్రామం చేరిన మృతదేహం


కొమురయ్య మృతదేహం

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం కొల్వాయికి చెందిన గోట్ల కొమురయ్య (52) మృతదేహం బుధవారం స్వగ్రామం చేరింది. కొమురయ్య దుబాయ్‌లోని ఓ కంపెనీలో పనులు చేస్తుండగా గుండెపోటు రావడంతో 15 రోజుల క్రితం మృతిచెందాడు. మృతుడికి భార్య జయ, కుమారులు రమేశ్, నరేశ్, కూతురు అనూష ఉన్నారు. మృతదేహనికి అంత్యక్రియలను కుటుంబ సభ్యులు పూర్తి చేసారు. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుంటుందని, బాధిత కుటుంబానికి రూ. 5 లక్షల పరిహారం అందేవిధంగా ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ద్వారా కృషిచేస్తామని కొల్వాయి విండో చైర్మన్ పొల్సాని నవీన్‌రావు, ఎంపీటీసీ రంగు లక్ష్మణ్ తెలిపారు.

చెక్‌పోస్ట్ వద్ద నగదు పట్టివేత

మెట్‌పల్లిరూరల్: బండలింగాపూర్ గండి హనుమాన్ ఆలయ సమీపంలోని అంతర్ జిల్లా సరిహద్దు చెక్‌పోస్ట్ వద్ద కారులో తరలిస్తున్న నగదును పట్టుకున్నట్లు ఇబ్రహీంపట్నం ఎస్సై అనిల్ తెలిపారు. బుధవారం వేర్వేరుగా కారులో తీసుకెళ్తున్న నిర్మల్ జిల్లా కిష్టాపూర్ కు చెందిన భరత్ వద్ద రూ.2 లక్షలు, కరీంనగర్‌కు చెందిన శ్రీనివాస్ వద్ద రూ.53 వేల నగదు గుర్తించామన్నారు. పట్టుబడ్డ నగదుకు సంబంధించిన ఆధారాలేమి లేవని, ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందునా పట్టుబడ్డ మొత్తాన్ని స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు తెలిపారు.

మా నాన్న ఎలా చనిపోయాడు!

- వంట మనిషి సుబ్బారావు కుటుంబ సభ్యుల వేదన


న్యాయం చేయాలని వేడుకుంటున్న సుబ్బారావు కుటుంబసభ్యులు

జ్యోతినగర్(రామగుండం): వంటలు తయారు చేసే ఓ కాంట్రాక్టు కంపెనీ నిర్వాహకులు పనులు చేసేందుకని తమ తండ్రి ఈర సుబ్బారావు(58)ను రామగుండం ఎన్టీపీసీకి తీసుకొచ్చారని, ఆ తర్వాత ఏమైందో గానీ, కొద్దిరోజులకే శవాన్ని అప్పగించారని మృతుడి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం పట్టణానికి చెందిన బాధితుల కథనం ప్రకారం.. సుబ్బారావు పలు కంపెనీల్లో వంటలు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో గతేడాది మార్చిలో ప్రభాత్ ఇంజినీరింగ్ వర్క్స్ కంపెనీ ద్వారా ఎన్టీపీసీ రామగుండం ప్లాంట్ క్యాంటీన్‌లో పనులు చేసేందుకు రప్పించారు. అయితే, ఆ కంపెనీకి చెందిన ఓ వ్యక్తి 2023జూలై 30న సుబ్బారావు చనిపోయాడని ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వెంటనే రామగుండం బయలుదేరిన కుటుంబసభ్యులు.. వరంగల్ చేరుకునేలోగా ఆ వ్యక్తి మరోసారి ఫోన్‌చేసి మృతదేహాన్ని భద్రాచలం పంపిస్తున్నామని చెప్పాడు. వెనుదిరిగిన కుటుంబసభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు. మిగతా విషయాలు తర్వాత మాట్లాడుకుందామని నచ్చజెప్పి వెళ్లిపోయారు. తమ తండ్రి ఎలా చనిపోయాడని కంపెనీ నిర్వాహకులను ప్రశ్నిస్తే సమాధానం ఇవ్వలేదు. పైగా సెటిల్ చేద్దామన్నారు. ఈవిషయంలో పోలీసులకు ఫిర్యాదు చేకుండా అడ్డుకున్నారు.

న్యాయం చేయండి – ఈర మురళీ కృష్ణ(కుమారుడు), కుల్పగిరి దేవకి(కూతురు), భద్రాచలం

వంట పనుల కోసం మా నాన్నను ఎన్టీపీసీ తీసుకొచ్చిన కంపెనీ నిర్వాహకులు చంపి మృతదేహాన్ని అంబులెన్స్‌లో మా ఇంటికి తీసుకొచ్చి వదిలేసి వెళ్లిపోయారు. ఆయన చనిపోయి ఏడు నెలలు కావస్తున్నా కంపెనీ వారు మమ్మల్ని సంప్రదించడం లేదు. ఫోన్‌చేస్తే సమాధానం ఇవ్వడం లేదు. మృతదేహంతో పంపిన కాగితాల్లో కూడా మృతికి గల వివరాలు పొంతన లేకుండా ఉన్నాయి. న్యాయం చేయాలని ఎన్టీపీసీ పోలీసులకు విన్నవించాం. మాది పేద కుటుంబం. మా అమ్మ మంగ గతంలోనే చనిపోయింది. మా నాన్న సుబ్బారావు మా ఐదుగురు సంతానాన్ని కష్టపడుతూ పోషించాడు. ఇప్పుడు నాన్న లేడు. మాకు ఆధారం లేకుండా పోయింది. మా కుటుంబానికి న్యాయం చేయండి. తమ్ముడు విజయదుర్గాప్రసాద్ కూడా గతంలోనే చనిపోయాడు. ఇప్పుడు మాకు ఆసరా లేకుండాపోయింది. కార్మిక నాయకులు, ప్రజాప్రతినిధులు, పోలీసులు జోక్యం చేసుకుని మా కుటుంబానికి న్యాయం చేయండి.

సిరిసిల్ల వాసికి తెలుగు వర్సిటీ కీర్తి పురస్కారం

- చరిత్ర పరిశోధనలో కృషికి అందజేత


కీర్తి పురస్కారం అందుకుంటున్న శ్రీనివాసరాజు

సిరిసిల్లకల్చరల్: జిల్లాకు చెందిన చరిత్ర పరిశోధకుడు డాక్టర్ చెన్నమాధవుని శ్రీనివాసరాజు మరో పురస్కారం అందుకున్నారు. వివిధ రంగాల్లో కృషిచేసిన వ్యక్తులకు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఏటా అందించే కీర్తి పురస్కారాల్లో భాగంగా జిల్లా వాసి సి.శ్రీనివాసరాజును పరిశోధన విభాగంలో ఎంపిక చేసింది. బుధవారం వర్సిటీలో నిర్వహించిన కార్యక్రమంలో తిక్కవరపు రామిరెడ్డి స్మారక పురస్కారాన్ని అందజేసింది. వర్సిటీ ఉపకులపతి డాక్టర్ తంగెడ కిషన్‌రావు, హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. శ్రీనివాసరాజు స్వస్థలం బోయినపల్లి మండలం వెంకట్రావుపల్లి. చరిత్ర పరిశోధన సమితిని స్థాపించారు. చారిత్రక ప్రాధాన్యం గల ప్రాంతాలను సందర్శించి అనేక విశేషాలను వెలుగులోకి తెస్తున్నారు. ఈక్రమంలో బహదూర్ కొండలరాయుడు నవల, భరతావని అనే కావ్యం, చక్రేశ్వరిదేవి, బొమ్మలమ్మగుట్ట శతకం, ప్రిన్సెస్ యశోధర అనే చారిత్రక నాటకం, మునునూరి కాపయ నాయకుడు నవల, అన్‌బీటెన్ ఎంపైర్ పేరిట వేములవాడ చరిత్ర, కెప్టెన్ రఘునందన్ జీవిత చరిత్ర, హిస్టరీ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్, మానవ జీవన పరిరక్షణ పేరిట కవితలు వెలువరించారు. ప్రిన్సిపాల్‌గా విశ్రాంత జీవనం గడుపుతూనే చరిత్ర పరిశోధన రంగంలో విశేష కృషి చేస్తున్న శ్రీనివాసరాజుకు కీర్తి పురస్కారం అందుకోవడంపై సాహితీవేత్తలు అభినందించారు.

ఒలింపియాడ్‌లో అల్ఫోర్స్ విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న నరేందర్‌రెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్): ప్రముఖ పోటీ పరీక్షల సంస్థ క్వెస్ట్ ఒలింపియాడ్ నిర్వహించిన జాతీయస్థాయి గణిత, సైన్స్ ఒలంపియాడ్‌లో కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇటెక్నో స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి బహుమతులు గెలుచుకున్నట్లు ఆ విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్‌రెడ్డి తెలిపారు. మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో ఆర్.శ్రీతన్(3వతరగతి), కె.హానీష్ రెడ్డి(4వ), రెడ్డి శ్రీరాజ్‌రెడ్డి(5వ), శివేన్‌రెడ్డి, సిద్విక్, ఎస్.సహార్ష్(6వ), శ్లోకా పున్నమ, వి.శ్రీచరణ్‌రెడ్డి, పి.వంశీకృష్ణ(7వ), స్వరవిస్మత్, సుమేధా మడమ రాజు(8వ), పి.శివాణి, జె.హన్సికరావు, క్వెస్ట్ సైన్స్ ఒలంపియాడ్‌లో జి.జోయల్ డేవిస్, జి.శివాన్స్‌రెడ్డి, వి.సహస్ర(4వ), సిద్విక్ నార్ల, పి.కృష్ణచైతన్యశ్రీ(6వ), జి.ప్రన్మాయరెడ్డి, శ్రీహిత చెడ్డిరెడ్డి, శ్లోకా పున్నం(7వ), ఎం.అతీష్‌పటేల్(8వ), సీహెచ్ సహస్ర(9వ) బహుమతులు గెలుచుకోవడం సంతోషంగా ఉందన్నారు. పాఠశాలలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అభినందించారు. ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అమెరికా యూనివర్సిటీతో 'జ్యోతిష్మతి' ఎంవోయూ

- జ్యోతిష్మతి చైర్మన్ జువ్వాడి సాగర్ రావు


ఒప్పందపత్రం చూపుతున్న జువ్వాడి సాగర్‌రావు

తిమ్మాపూర్: జ్యోతిష్మతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ–సైన్స్ విద్యా పరిశోధన, ఉన్నత విద్యలో ప్రవేశాల సహకారాన్ని పెంపొందించే లక్ష్యంతో అమెరికాలోని లూసియానా టెక్ యూనివర్సిటీతో అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకుంది. లూసియానా టెక్ విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ విద్యలో అంతర్జాతీయంగా గుర్తింపు పొందిందని జ్యోతిష్మతి విద్యాసంస్థల చైర్మన్ జువ్వాడి సాగర్ రావు అన్నారు. కళాశాల విద్యార్థులకు అంతర్జాతీయ ఎక్స్పోజర్, ఎంఎస్ ప్రోగ్రాంలో అడ్మిషన్లు పొందడంలో యోగ్యతను అందిస్తుందని తెలిపారు. జ్యోతిష్మతి విద్యార్థులు ఈ సహకారం యొక్క నైపుణ్యం, వనరులు అవకాశాల నుంచి ప్రయోజనం పొందేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

ఎస్‌జీటీలకు పదోన్నతి కల్పించాలి

కరీంనగర్: పండిట్, పీఈటీ అప్‌గ్రేడేషన్‌లో అర్హులైన ఎస్‌జీటీలకు ప్రమోషన్లు కల్పించాలని ఎస్‌జీటీ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు అనిల్‌కుమార్‌రెడ్డి, శ్రీరాందాస్‌లు ఒక ప్రకటనలో కోరారు. పండిట్ పోస్టుల అప్‌గ్రేడేషన్ పోస్టుల విషయంలో హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన తీర్పు మూలంగా ఏర్పడిన పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం తక్షణమే అందరికీ న్యాయం జరిగేలా జీవో 11,12 లకు చేసిన సవరణలను రద్దుచేసి నూతనంగా కామన్ సీనియారిటీ ప్రాతిపదికగా ఎస్‌జీటీలకు అవకాశం కల్పించాలన్నారు. మూడో కేటగిరీ నుంచి రెండవ కేటగిరి ప్రమోషన్ పొందే ఏ ఉపాధ్యాయుడైన ఏ ప్రమోషన్‌కైనా అవకాశం కల్పించేలా నూతన చట్టాలు తీసుకొచ్చి సమన్యాయం చేయాలని కోరారు.

కదిలించేది కవిత్వం

కరీంనగర్‌కల్చరల్: కదిలేది.. కదిలించేది.. పెనునిద్రను వదిలించేది.. మనిషిని ముందుకు నడిపించేది కవిత్వం. సమాజ శ్రేయస్సే కవిత్వం పరమావధి కావాలన్నిది నిర్వివాదాంశం. సామాజిక చైతన్యాన్ని కలిగించే కవితలు ప్రపంచాన్ని శాసిస్తాయి. 1999లో ఫ్రాన్స్ రాజధాని ప్యారిస్ జరిగిన యునెస్కో 30వ సదస్సులో మార్చి 21వ తేదీని ప్రపంచ కవితా దినోత్సవంగా పాటించాలని నిర్ణయించారు. గురువారం కవితా దినోత్సవం సందర్భంగా జిల్లా కవుల అభిప్రాయాలు..

మానవత్వాన్ని తట్టి లేపుతుంది



కడుపులోంచి తన్నుకువచ్చే దు:ఖం నా కలం. వలవలా శోకంలా రాలిన కన్నీరు నా కవితాత్మ. కవిత్వమే నా హృదయం. కవిత్వమే నాకు ప్రాణవాయువు. కవిత్వం మనిషిలోని మానవత్వాన్ని తట్టి లేపుతుంది. మనిషి కవిత్వాన్ని ఆవాహన చేస్తే జీవితం కడిగిన ముత్యం అవుతుంది.

– అన్నవరం దేవేందర్, సాహితీవేత్త

ప్రజల పక్షాన నిలవాలి



కవిత్వం హృదాయాలను కదిలించే విధంగా ఉండాలి. సమాజ చైతన్యానికి దోహదం చేయాలి. రుగ్మతల నివారణకు ఉపయోగపడాలి. పాలకులను అప్రమత్తం చేసేలా ఉండాలి. కవులు తమ రచనలతో ప్రజల పక్షాన నిలవాలి. ప్రజల సమస్యలను కవిత్వం అద్దం పట్టాలి.

– దాస్యం సేనాధిపతి, కవి, రచయిత, విమర్శకుడు

ఆటోనే కవిని చేసింది



ఆటో నడుపుకుని జీవించే నన్ను ఓ వర్ధమాన కవిగా నిలుపుతోంది కవిత్వమే. ఎన్నీల ముచ్చట్ల ద్వారా కవితా స్ఫూర్తితో ఈ రంగంలోకి అడుగిడిన నేను ప్రపంచ తెలుగు మహాసభల్లో నా కవిత్వాన్ని వినిపించాను. పలువురి కవితలను చదవడం, కవి సమ్మేళనాలకు హాజరుకావడం నాలో కవిత్వంపై మరింత ఆసక్తిని పెంచింది.

– ఖాలీద్, ఆటో కవి

సమాజహితం కోరుకుంటుంది



సాహిత్యం అంటే సమాజానికి హితాన్ని చేకూర్చేది. సమాజంలో ఎంత ఎక్కువగా కవులు తయారైతే అంత మంచి జరుగుతుంది. స్పందించే గుణం, చైతన్యాన్ని చూపించే గుణం కవులలో అధికం. అందుకే కవి అనేవాడు ప్రతి చిన్న విషయానికి స్పందిస్తాడు, ప్రతి సంఘటనను కవితీకరిస్తాడు. అందుకే కవులను ప్రోత్సహించాల్సిన అవసరం నేడు ఎంతైనా ఉంది.

– గాజుల రవీందర్, జాతీయ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు